సచివాలయాల్లో ప్రజాసేవలు

గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కావాలంటే చెప్పులరిగేలా తిరిగే పరిస్థితి ఉండేది. ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే ముందు జిరాక్స్ సెంటర్‌లో అనెక్షర్ అప్లికేషన్ రూ.20 పెట్టి కొని, అర్జీలు రాసేవారికి రూ.20 ఇచ్చి రాయించుకోవాలి. ఆ తరువాత ఆ ఫారాలను వీఆర్వోకు కొంత సమర్పించుకుని ఇస్తే అప్పుడు ఆ దరఖాస్తును తహసీల్దార్ వద్దకు చేరేది. అలా వారం రోజుల పాటు ఆఫీసు చుట్టూ తిరిగాక, సర్టిఫికెట్లు సిద్ధమైనా కూడా కార్యాలయ అటెండర్లకు దక్షిణ సమర్పిస్తే గానీ చేతిలోకి వచ్చేవి కాదు. ఇదంతా గతం.. ఇప్పుడలా కాదు వలంటీర్ ద్వారా లేదా గ్రామ సచివాలయంలో ప్రింటెడ్‌ఫామ్ పూర్తి చేసి ఇస్తే చాలు. సిటిజన్ చార్టర్ ప్రకారం వలంటీర్ ద్వారా కావాల్సిన సర్టిఫికెట్ రూపాయి ఖర్చు లేకుండా అందుతోంది.

- ప్రజలకు తమ సొంతూర్లలోనే అన్ని రకాల సేవలు
- ఏ సర్టిఫికెట్ కావాలన్నా వెంటనే అందుతున్న వైనం
- ప్రజల ఇళ్ల వద్దే సమస్యలను పరిష్కరిస్తున్న వలంటీర్లు
- భూముల రిజిస్ట్రేషన్ల సేవలు సైతం అందుబాటులోకి..
- సచివాలయాల్లో 545 సేవలు అందడంపై యావత్ ప్రజల సంతృప్తి


ప్రజాసేవల్లో జిల్లాలోనే టాప్‌లో ఉన్న గంటావూరు సచివాలయం


ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: ప్రస్తుతం సచివాలయాల్లో 545 సేవలు ఉండగా వీటిలో 400 దాకా సేవలు అందుబాటులో ఉన్నాయి. గతంలోని మీసేవా కేంద్రాలు, కామన్ సర్వీసు కేంద్రాలు, డిటిజల్ సేవలన్నింటినీ ప్రభుత్వం ఒకే గొడుకు కిందకు తెచ్చింది. ఇందులో భాగంగా ఆధార్ కరెక్షన్లు, ఇపిక్ సేవలు, లైఫ్ సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్‌కార్డు, బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డులు, రీచార్జ్ వగైరాలు, పాన్‌కార్డు ఇలా ఏ సేవలైనా పొందవచ్చు. ప్రభుత్వ సేవలకు సంబంధించి కరెంట్‌బిల్లుల చెల్లింపులు, పాస్‌పోర్టుకు దరఖాస్తు, రెన్యూవల్స్, డ్రైవింగ్ లైసెన్సులు, ఓటర్‌కార్డులు, గ్యాస్ బుకింగ్, రెవెన్యూకి సంబంధించిన అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. అంతేగాకుండా విద్య, వ్యవసాయ, ఆరోగ్య, రవాణా, వాణిజ్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

ఇకపై రిజిస్ట్రేషన్ సేవలు కూడా..

ఇప్పటిదాకా భూముల రిజిస్ట్రేషన్లలో డాక్యుమెంట్ రైటర్లే కీలకంగా వ్యవహరించేవారు. స్టాంపులు మొదలుకుని రిజిస్టర్ జరిగే దాకా వీరు అడిగినంత ఇవ్వాల్సిందే. అయితే రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్రయ, విక్రయదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఈ సేవలను సైతం సచివాలయాల్లో చేర్చింది. తాజాగా


పలమనేరు మండలంలోని సముద్రపల్లి గ్రామ సచివాలయం

పలమనేరు మండలంలోని కూర్మాయి సచివాలయ పరిధిలో జిల్లాలోనే తొలి రిజిస్ట్రేషన్ పంచాయతీ సెక్రటరీ లాగిన్ ద్వారా గత గురువారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. దీంతో ఇకపై సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి వచ్చినట్టే. ఇప్పటికే ఎంపిక చేసిన సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్లపై శిక్షణ కూడా ఇప్పించారు.

సచివాలయాల సమాచారం..

పలమనేరు మండలంలో

మొత్తం సచివాలయాలు :	11
అర్బన్‌లో మొత్తం సచివాలయాలు :	12
మొత్తం అందుబాటులోని సేవలు :	400కు పైగా
ఒక్కో సచివాలయంలో సిబ్బంది :	11మంది

అర్జీ పెట్టిన వారానికే..

నాకు సాంకేతిక కారణాలతో పెన్షను రాకుండా పోయింది. దీంతో సచివాలయంలో అర్జీ పెట్టుకున్నా. వారు విచారించి సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ ద్వారా కావాల్సిన సర్టిఫికెట్లను పెట్టి నాకు పింఛను అందేలా చేశారు. నిజంగా ఇంత త్వరగా అర్జీ పెట్టిన వారంలోనే పింఛను అందుతుందని అనుకోలేదు.

– రామయ్య, సముద్రపల్లి, పలమనేరు మండలం

ఎంతో సౌకర్యంగా ఉంది..


పిల్లలకు ఇన్‌కం సర్టిఫికెట్ కోసం పనులను వదులుకుని పలమనేరుకు వెళ్లి ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ప్రభుత్వ చలువతో మా గ్రామంలోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు పొందుతున్నాం. మాకు ఎంతో సౌకర్యంగా మారింది. ఇటీవల నేను ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే మూడురోజుల్లో అందింది.

– సుబ్రమణ్యం రెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

మొదట్లో ఎగతాలి చేశారు..


నేను డిగ్రీదాకా చదువుకున్నా. 2019లో వలంటీర్‌గా చేరాను. డిగ్రీ చదివి వలంటీర్‌గా ఎందుకు చేరతావని చాలామంది ఎగతాలి చేశారు. కానీ నేను నా క్లస్టర్ పరిధిలోని 65 కుటుంబాలకు సేవ చేయడాన్ని ఆనందంగా భావించా. అందుకే నా సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం సేవావజ్ర పురస్కారం అందించి సత్కరించింది.

– నిఖిల, సముద్రపల్లి వలంటీర్

ఏ సేవ కావాలన్నా సిద్ధం


ప్రభుత్వ సేవల కోసం పట్టణాలకు వెళ్లకుండా ప్రజలు తమ గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే వందలాది సేవలను ప్రస్తుతం సచివాలయాల్లో అందిస్తున్నాం. ప్రజలకు సౌకర్యవంతంగా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

– మురళీనాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్, సముద్రపల్లి సచివాలయం

సంతోషంగా ఉంది..


మొదట్లో వలంటీర్లంటే జనంలో కాస్త తక్కువ చూపు ఉండేది. ఇప్పుడలా కాదు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకంగా ఉన్నామని ప్రజలకు తెలిసింది. దీంతో మేము కూడా బాధ్యతగా సేవలందిస్తున్నాం. ఇటీవల నాకు సేవామిత్ర పురస్కారం అందింది. ప్రజలకు మరింతగా సేవలందిస్తా.

– గీత, వలంటీర్, రంగాపురం సచివాలయం, పలమనేరు

క్లుప్తంగా

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం


వేంకటేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామకుప్పం: మండలంలోని విజలాపురం మురుగేష్ కల్యాణ మండపంలో శనివారం రాత్రి ఉన్నిగానిపల్లి తిమ్మరాయస్వామి, చౌడేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో టీటీడీ వేదపండితులచే శ్రీలక్ష్మీ పద్మావతీదేవీ, శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ పండితులు వేదపారాయణం చేశారు. వేంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఆత్మీయ సదస్సు

పుంగనూరు: పట్టణంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఆత్మీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సభ నిర్వాహకులు డాక్టర్ మునీంద్రనాయక్ తెలిపా రు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడు తూ స్థానిక ఆర్‌ఆర్ కల్యాణ మండపంలో జరి గే ఈ కార్యక్రమం నాగరాజగౌడు, మధు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా లోని బడుగు బలహీన వర్గాల వారు అధిక సంఖ్యలో హాజరై, తమ సమస్యల పరిష్కారానికి సూచనలు చేయాలని తెలిపారు.

15న మార్కెట్ కమిటీ షాపుల వేలం

పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ కమిటీ సముదాయంలో ఉన్న నాలుగు దుకాణాలకు ఈనెల 15న వేలం పాటలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి గోపి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టీ స్టాల్, ఫలహారశాల, కూల్‌డ్రింక్స్ షాపులు–2 నాలుగు షాపులను ఏడాదికి లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ఆసక్తి గల వ్యాపారులు ఒక్కక్కో షాపునకు రూ.25 వేల ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కుప్పం: పట్టణం నుంచి నూలుకుంటకు వెళ్లే మార్గంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు జరిపిన తనిఖీల్లో 1,104 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీని చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మార్వాడ క్రాస్ వద్ద సెబ్ అధికారులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఓ కారులో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అందులో 816 క్వార్టర్, 90 ఎంఎల్ 288 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కారుతో పాటు అందులో ఉన్న ఇద్దరు యువకులను విచారించారు. నిందితులు నూలుకుంటకు చెందిన వెంకటేశు(21), నసీబ్(33)గా గుర్తించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కిషోర్‌కుమార్, ఎస్ఐ రామ్మూర్తి వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

సర్వమతాలకు దైవం ఒక్కటే


త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

రామకుప్పం: నవసమాజ స్థాపనే త్రైత సిద్ధాంత భగవద్గీత లక్ష్యమని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి శివరాం కమిటీ అధ్యక్షుడు కృష్ణప్ప తెలిపారు. మండలంలోని విజలాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమతాలకు దైవం ఒక్కటే అన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. సమాజంలో శాంతి నెలకొల్పడానికి త్రైత సిద్ధాంత భగవద్గీత పఠనం చాలా అవసరమన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరాలను ప్రజలు తెలుసుకోవడం ద్వారా సమాజంలో ధర్మస్థాపన సాధించడం సాధ్యమవుతుందని తెలిపారు. సంఘం సభ్యులు రంగప్ప, రాణి, చిన్నక్క, రాజేశ్వరి, విమలమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష


ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి 91 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. పరీక్షకు 74 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను ప్రకటించి అర్హత సాధించిన విద్యార్థులను చేర్చుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు ఎంఈవో హసన్ బాషా, పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు పాల్గొన్నారు.

మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలు


నియోజకవర్గ స్థాయి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నాటి టీడీపీ పాలనతో పోల్చితే నేటి వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగు పడ్డాయని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రజలకు అందాల్సిన లబ్ధి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యుల చేతుల్లోకి చేరేదన్నారు. నేటి వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలకు జరిగిన నష్టం, నేటి పాలనలో జరిగిన మేలును ఆయన నిపుణుల సాయంతో వీడియో ప్రదర్శన ద్వారా చూపెట్టారు. ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో పేదల సంఖ్య సైతం గణనీయంగా తగ్గిందన్నారు. ఈ పరిస్థితులను గమనిస్తే జగనన్న పాలనలో ప్రజలు ఆర్థికంగా బాగున్నంటేనన్నారు. ఇక్కడ తెలుసుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి వారిలో చైతన్యాన్ని నింపాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

ఉచితంగా శుద్ధజలం సరఫరా


దండుమిట్టలో మినరల్ వాటర్‌ను పట్టుకుంటున్న మహిళలు

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మిరాజేష్ గత కొన్ని నెలలుగా తన పరిధిలోని ప్రతి ఇంటికీ పూటకు రెండు క్యాన్ల అపోలో మినరల్ వాటర్(శుద్ధజలం) అందిస్తున్నారు. మున్సిపాలిటీలో నీటి సమస్య లేనప్పటికీ సంబంధిత ప్రాంతం ఎత్తుగా ఉండడంతో రోజు మార్చి రోజు నీరందుతోంది. అయితే పేదలు ఎక్కువగా ఉండే ఈ వార్డులో ఇంటింటికీ మినరల్ వాటర్ ఇవ్వాలనే తలంపుతో సంబంధిత వార్డు కౌన్సిలర్ తన సొంత నిధులతో మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నారు. ఇంటికి రోజుకు రెండు క్యాన్లు కొనాలంటే రూ.30 నెలకు రూ.900 అవుతుందని, అందుకే ఈ సాయం చేసినట్టు కౌన్సిలర్ తెలిపారు. దీంతో ఆ వార్డు ప్రజలు కౌన్సిలర్, ఎమ్మెల్యే వెంకటేగౌడ, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

టీడీపీ హయాంలో ఏమి చేశారో చెప్పాలి ?


మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరయ్య

సోమల: టీడీపీ హయాంలో మండలంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, స్థానిక సర్పంచ్ మసూద్ అధ్యక్షతన ఆదివారం కందూరులో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, పార్టీ జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి గాలి సురేష్ మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మూడు రోజులుగా మండలంలో పర్యటిస్తూ మంత్రి పెద్దిరెడ్డిపై అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆయనకు దమ్ము ధైర్యం ఉంటే గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని నిరూపించాలని సవాల్ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో మండల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. మండల అభివృద్ధికి ఎంత మేరా నిధులు కేటాయించారో, ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు వస్తే నిరూపిస్తామన్నారు. పడమటి మండలాల రైతులకు సాగు, తాగు నీరు అందించాలన్న ఉన్నత సంకల్పంతో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారని, వాటిని అడ్డుకున్న ఘనత చంద్రబాబు నాయుడిది కాదా అని ప్రశ్నించారు. గ్రామస్తులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మీరు వెనుతిరిగిన విషయం వాస్తవం కాదా అని నిలదీశారు. 2014 టీడీపీ మెనిపెస్టోలో ఇచ్చిన 600 అపద్దపు హామీలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని భూ స్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీటీసీ వేముల హరినాథ్, సర్పంచ్ సురేంద్రరెడ్డి, మెకానిక్ బాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు ..

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ పరిధిలోని బిరుగుండ్లపల్లి, నక్కబాలేపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ట్రస్టు ప్రారంభం

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ సహాయ సహకార ట్రస్టును కొల్లుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంగనపల్లి పంచాయతీ పరిధిలో వివాహం చేసుకున్న వారికి, మృతి చెందిన కుటుంబాలకు రూ.1116 ఈ ట్రస్టు తరఫున సాయం అందిస్తామని తెలిపారు. ఏదైనా సాయం కావాలనుకున్న వారు వైఎస్సార్‌సీపీ ట్రస్టును సంప్రదించాలని కోరారు.

ఘనంగా మారయ్య, కావమ్మ తిరనాళ్ల


కావమ్మ, మారయ్యల పూజల్లో పాల్గొన్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డి గారిపల్లె పంచాయతీ గేటుకాడ బెస్తపల్లెలో మూడు రోజులుగా కావమ్మ–మారయ్య తిరనాళ్లను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె అందజేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా బాటగంగమ్మ జాతర


విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్లలో శనివారం రాత్రి బాటగంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారిని ప్రతిష్టించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షితంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. గంగజాతరకు విచ్చేసిన బంధువులతో నెల్లిపట్ల గ్రామంలో సందడి నెలకొంది.

ఘనంగా ముత్యాలమ్మ దేవర్లు


ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ పాతకురవపల్లెలో ముత్యాలమ్మ దేవర్లను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 40 రోజుల క్రితం గ్రామంలో సుమారు రూ.13 లక్షలతో ఆరబాలమ్మ, గంగమ్మ, ముత్యాలమ్మ ఆలయాలను నిర్మించారు. 41 రోజులు ఇంటింటా పూజలు నిర్వహించారు. శనివారం పూజలు పూర్తి కావడంతో ఆదివారం ఆలయాల వద్ద బలి ఇచ్చారు. అమ్మవార్లను ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి శంకర్ నారాయణ కుమారుడు పృథ్వీ, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, నాయకులు వెంకటరమణ, చిన్న నాగరాజ, రామనారాయణరెడ్డి, కరీముల్లా, నాగిశెట్టి రెడ్డెన్న, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పుంగనూరులో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ శివ తదితరులు

పుంగనూరు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ కోరారు. స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం కుప్పం మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 82 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వారిలో 32 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ ప్రతి నెలా వైద్య శిబిరాలు నిర్వహించి, వందలాది మందికి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పడమటి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.
కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు ఈశ్వరమ్మ, గోపాలక్రిష్ణ, సుధాకర్‌రావు, త్రిమూర్తి రెడ్డి, రఘుపతి, సురేష్, రజిఅహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆల్ఫాన్స్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆల్ఫాన్స్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. వి షయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ వారి కుటుంబానికి సంతాపం తెలిపాడు. వైస్ ఎంపీపీ జీడీబాబు ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధనుంజయరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సురేష్, సచివాల య కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు సంతాపం తెలియజేశారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం పెంపు


ప్రశంసాపత్రాలందుకున్న చిన్నారులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల


గంగవరంలో..

పలమనేరు/గంగవరం/వి.కోట: జిల్లాలోని గ్రంథాలయాల్లో గత నెల రోజులుగా సాగిన వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమం చిన్నారుల్లో విజ్ఞానాన్ని నింపిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె పలమనేరు, గంగవరం, వి.కోట గ్రంథాలయాలను పరిశీలించారు. వేసవి శిక్షణ గురించి గ్రంథాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ఘనులు లాంటివి గ్రంథాలయాలన్నారు. నేటి స్మార్ట్‌ఫోన్ సమాజంలో పిల్లలు పుస్తకపఠనంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో మంచి ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: వేసవి సెలవుల సందర్భంగా గ్రంథాలయంలో గత నెల 8 నుంచి నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ఆదివారం ముగిసింది. విద్యార్థులలో ఆలోచన శక్తిని పెంచి, సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపులో 7 అంశాల్లో పోటీలు నిర్వహించా రు. ఒక్కో విభాగంలో విజేతలుగా నిలిచిన ముగ్గురికి స్థానిక లైబ్రేరియన్ సుభాషిణి బహుమతులను అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

గంగవరం: మండలంలోని పత్తికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోవడం వల్ల అదనపు సప్లై కోసం కరెంటు తీగలు లాగడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వలంటీర్లకు సత్కారం

శాంతిపురం: ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామ వలంటీర్లను సత్కరించనున్నట్లు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు చౌడంపల్లి క్రాసులోని మండల హార్టికల్చర్ హబ్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ భరత్ హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ


అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోర్కెలు నెరవేరిన వారు మొక్కులు చెల్లించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈఓ చంద్రమౌళి భక్తులకు సదుపాయాలు కల్పించారు. ఎస్ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.


బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ